

'గిరి' పల్లెల్లో.. దురాడి సంబురం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ఆదివాసీ గ్రామాల్లో నేడు పులారా, హోలి (దురాడి) పర్వదినం సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం... 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆది: 6:29	సోమ: 4:54

గరిష్టం/కనిష్టం
37.0 /25.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

30 వరకు పింఛన్ భట్వాడ

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వం లబ్ధిదారులకు అందించే ఆసరా పెన్షన్ (వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, చేనేత, కల్లుగీత, ఒంటరి మహిళ)లకు ఈ నెల 30వ తేదీ వరకు భట్వాడ చేయడం జరుగుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి సురేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు పింఛన్‌ను నేరుగా సంబంధిత తపాలాశాఖ నుండి పొందవచ్చని, ఇందుకు ఎలాంటి సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

ఎన్నికల సమన్వయకర్తగా దండె విఠల్



దండె విఠల్

కాగజ్‌నగర్ రూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సిర్పూర్ నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్తగా ఎమ్మెల్సీ దండె విఠల్ ను నియమిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

నేడు డోలోత్సవం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ శ్రీ కేశవనాథస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా స్వామి వారికి డోలోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఒజ్జల నరేష్‌శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డోలోత్సవం అనంతరం రాత్రి 7 గంటలకు కామదహనం కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆదివారం ప్రజలంతా హోలీ పండుగను జరుపుకోవాలని సూచించారు. డోలోత్సవం, కామదహనం కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆకట్టుకున్న 'దంగల్'



పోటీలో తలపడుతున్న మల్లయోధులు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని శ్రీవెంకటేశ్వరస్వామి జాతరలో శనివారం మల్లయోధులకు నిర్వహించిన కుస్తీపోటీలు ఆకట్టుకున్నాయి. ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 10 మంది, మహారాష్ట్రలోని నాందేడ్, కొల్హాపూర్, పర్భని, కిన్వట్, ముఖ్కెడ్ నాగల్‌కొండ, టెకమాండ్వా, జివితి, తదితర ప్రాంతాల నుంచి 60 మంది పోటీల్లో పాల్గొని ప్రతిభను చూపారు. మహారాష్ట్రకు చెందిన కేంద్రె జగన్ రూ.4 వేలు, పురి రామారావు రూ. 2,100 బహుమతి గెల్చుకున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న కూశన రాజన్న

ఆసిఫాబాద్‌అర్బన్/కాగజ్‌నగర్‌రూరల్: కాలవర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జిల్లా కార్యదర్శి కూశన రాజన్న శనివారం కలెక్టర్ వెంకటేశ్‌దోత్రేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంటలు చేతికి వచ్చే సమయంలో కురిసిన వర్షానికి చింతలమానెపల్లి, బెజ్జూర్, దహెగాం, సిర్పూర్(టి), ఇతర ప్రాంతాల్లో రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 20వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు దుర్గం దినకర్, గొడిసెల కార్తీక్ పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు 99 శాతం హాజరు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం నిర్వహించిన గణితం పరీక్షకు 99 శాతం హాజరు నమోదైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తెలిపారు. జిల్లాలోని 37 పరీక్ష కేంద్రాల్లో 6,425 మంది విద్యార్థులకు గానూ 6,387 మంది హాజరుకాగా 38 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో గతేడాది ఫెయిల్ అయిన (ప్రైవేట్ విద్యార్థులు 92 మందికి గానూ 76 మంది హాజరుకాగా 16 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లాలోని తిర్యాణి, రెబ్బెన, కాగజ్‌నగర్, తదితర సెంటర్లను డీఈవో తనిఖీ చేశారు.

బడుల్లో అమ్మ ఆదర్శ



సంజీవనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

- వసతుల కల్పనే ధ్యేయంగా..
- ఎస్ఎంసీల స్థానంలో కమిటీలు
- వీటికే పాఠశాల నిర్వహణ బాధ్యతలు
- రెండేళ్ల పాటు పర్యవేక్షణ

పెంచికల్‌పేట్: ప్రభుత్వ బడుల్లో మౌళిక వసతుల కల్పన, పర్యవేక్షణలో భాగస్వాములను చేయటానికి ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. కమిటీ అధ్యక్షురాలిగా గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల అధ్యక్షురాలు, సభ్యులుగా సంఘం సభ్యులను నియమించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ బడుల్లో ఆదర్శ కమిటీల ఎంపిక పూర్తి కావడంతో కమిటీ అధ్యక్షురాలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంయుక్తంగా బ్యాంకు ఖాతాలను తెరిచారు. జిల్లాలోని 721 ప్రభుత్వ బడుల్లో ఎస్ఎంసీల స్థానంలో రెండేళ్లపాటు కమిటీలు పర్యవేక్షణ చేయనున్నాయి.

కమిటీల బాధ్యతలు

ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కల్పనకు అమ్మ ఆదర్శ కమిటీలు పనిచేయనున్నాయి. ప్రధానంగా బాలికలకు మరుగుదొడ్ల ఏర్పాటు, తాగునీటి వసతి, మరమ్మతులు, విద్యుత్ సౌకర్యం, పారిశుధ్య పనులు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనంతో పాటు పాఠశాలల్లో చేపట్టే పలు అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం కానున్నాయి. మరోవైపు ప్రభుత్వ బడుల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఏకరూప దుస్తులను సకాలంలో అందించే బాధ్యతలను సైతం స్వయం సహాయక సంఘాల్లో పనిచేస్తున్న మహిళలకు అప్పగించనున్నారు. దీంతో ప్రభుత్వ బడుల్లో పర్యవేక్షణ, వసతుల కల్పన, సమస్యల గుర్తింపులో ఆదర్శ కమిటీలు పనిచేయనున్నాయి.

ఎస్‌హెచ్‌జీ సభ్యులతో కొత్త కమిటీలు

ప్రభుత్వ బడుల్లో ఏర్పాటు చేసే అమ్మ ఆదర్శ కమిటీల్లో గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు కమిటీ అధ్యక్షురాలిగా, ప్రధానోపాధ్యాయుడు మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థుల తల్లులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలకు మాత్రమే కమిటీల్లో సభ్యులుగా అవకాశం కల్పిస్తున్నారు. కమిటీల్లో ప్రతీ తరగతి నుండి ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలు సంయుక్తంగా చెక్ పవర్ బాధ్యతలు నిర్వహించనున్నాయి.

అధికారులతో కలిసి ప్రతిపాదనలు

ప్రభుత్వ బడుల్లో ఏర్పాటు చేస్తున్న ఆదర్శ కమిటీలు ఇటు ప్రభుత్వ ఉపాధ్యాయులు, అటు వసతుల కల్పనకు కృషి చేసే అధికారులతో కలిసి ప్రతిపాదనలు తయారు చేయనున్నారు. పాఠశాలలో అత్యవసర పనులను చేసే బాధ్యతను కమిటీలకు అప్పగించనున్నారు. ప్రభుత్వ బడుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను కమిటీల ద్వారా వినియోగించనున్నారు. రూ.25వేల లోపు పనులు కమిటీలు పూర్తి చేయనుండగా అంతకు మించితే ఇంజనీరింగ్ అధికారుల ప్రతిపాదనలు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో చేయనున్నారు.

కమిటీల ఏర్పాటు పూర్తి అయ్యింది

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 721 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశాం. ఆయా పాఠశాలల్లో ఇప్పటికే కమిటీల ఏర్పాటు పూర్తి అయ్యింది. ఎస్‌హెచ్‌జీ అధ్యక్షురాలు, మెంబర్ కన్వీనర్‌గా హెచ్ఎం జాయింట్ ఖాతాలను తెరిచే ప్రక్రియ కొనసాగుతోంది.

– పి.అశోక్, డీఈవో

కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా ఆత్రం సక్కును అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆత్రం సక్కుతో కలిసి పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను పల్లెల్లో ప్రజలకు వివరించాలన్నారు. కొందరు అవకాశవాదులు పార్టీని వీడినప్పటికీ వారితో ఎలాంటి నష్టం లేదన్నారు. పార్టీని వదలి వెళ్లిన వారిని తిరిగి చేర్చుకునేది లేదని స్పష్టం చేశారు. ఆత్రం సక్కు మాట్లాడుతూ ప్రజలు బీఆర్ఎస్‌ను విశ్వసిస్తున్నారన్నారు. కేవలం సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దన్నారు. మహిళలకు ఉచిత బస్సుసౌకర్యం తప్ప ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో ఆరు గ్యారంటీలు అమలు కాలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జెడ్పీటీసీ అనిగెల నాగేశ్వర్‌రావ్, జెడ్పీటీసీలు అజయ్, ద్రుపదాబాయి, ఎంపీపీలు మల్లికార్జున్, సౌందర్య, మోతీరాం, నాయకులు సరస్వతి, పోచయ్య, శ్రీనివాస్, అబ్దుల్లా, అలీబిన్ అహ్మద్, రవి, ఎత్తేశ్యాం, సంజీవ్, హైమద్, తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల కదలికలపై నిఘా ఉంచాలి



అవార్డు అందజేస్తున్న ఏఎస్పీ ప్రభాకర్

ఆసిఫాబాద్: మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అదనపు ఎస్పీ ప్రభాకర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో వారం రోజులుగా గ్రేహౌండ్స్ శిక్షణ పొందుతున్న పోలీసు శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న మెలకువలు విధుల్లో ఉపయోగించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా గ్రేహౌండ్స్ శిక్షణలో ప్రతిభ చాటిన పోలీసులకు అవార్డులు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ రాణా ప్రతాప్, సీఐ సతీశ్, ఆర్ఐ అడ్మిన్ పెద్దన్న, గ్రేహౌండ్స్ ఆర్ఎస్సై సంజీవ్, ఆర్ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీఎం వైఖరికి నిరసనగా నిరాహార దీక్ష



దీక్షలో కూర్చున్న కృష్ణారావు

కాగజ్‌నగర్‌రూరల్: ఎస్పీఎం మిల్లు యాజమాన్యం వైఖరికి నిరసనగా లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షలకు ఇన్‌చార్జి జెడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావు, కాంగ్రెస్ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కిశోర్‌బాబు మాట్లాడుతూ తమ డిమాండ్ల సాధన కోసం పలు దఫాలుగా కలెక్టర్ స్థాయి అధికారులతో చర్చలు జరిపినా ఎస్పీఎం యాజమాన్యం మొండివైఖరి వీడడంలేదన్నారు. పెరుగుతున్న డీజిల్ ధరలకు అనుగుణంగా తమకు చెల్లిస్తున్న కిరాయిని పెంచాలని ఈ నెల 6 నుంచి సమ్మె చేపడుతున్నా యాజమాన్యం స్పందించడంలేదన్నారు. ఇన్‌చార్జి జెడ్పీచైర్మన్ కృష్ణారావు మాట్లాడుతూ ఎస్పీఎం యాజమాన్యం వెంటనే లారీ అసోసియేషన్‌తో చర్చలు జరిపి డిమాండ్లను పరిష్కరించాలన్నారు. రావి శ్రీనివాస్ మాట్లాడుతూ వెంటనే చర్చలు జరిపి సమస్య పరిష్కరించాలన్నారు.

మళ్లీ గడువు పెంపు



మందమర్రి పట్టణంలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి

- ఈ నెలలోపు పూర్తి చేయలేక సాగదీత
- జాతీయ రహదారి–363 పనుల్లో జాప్యం
- అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్లకు లబ్ధి
- పెరిగే ఖర్చులతో ప్రజలపై మరింత భారం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జాతీయ రహదారి -363 పనుల్లో జాప్యం జరుగుతూనే ఉంది. కాంట్రాక్టర్లకు గడువు మీద గడువు ఇస్తుండడంతో పనులు సకాలంలో పూర్తి చేయని పరిస్థితి నెలకొంది. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం నుంచి తాండూర్ మండలం రేపల్లెవాడ వరకు 42కిలోమీటర్లు, ప్యాకేజీ-2లో రేపల్లెవాడ నుంచి వాంకిడి మండలం గోయగాం వరకు 52కిలోమీటర్లు.. మొత్తం 94కిలోమీటర్లు రోడ్డు నిర్మించాలి. ప్యాకేజీ-1 నిర్మాణ పనులు 2020 ఆగస్టు 17న ప్రారంభమయ్యాయి. ఒప్పందం ప్రకారం 2022 ఆగస్టు 16నాటికే పూర్తి చేయాలి. లాక్‌డౌన్, అదనపు పనులు, భూ సేకరణ, అటవీ పనులు, మిషన్ భగీరథ పైపుల తొలగింపు తదితర కారణాలు చూపుతూ కాంట్రాక్టర్‌కు గడువు మీద గడువు పెంచుతున్నారు. ఇక ప్యాకేజీ-2 పనులు 2021మార్చి 3న మొదలయ్యాయి. షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరికే పూర్తి కావాల్సి ఉన్నా కాలేదు. ఈ నెల చివరిలో పూర్తి చేయాల్సి ఉన్నా కాలేదు. ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనలో జాతీయ రహదారి ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ ఇక్కడి అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో జాప్యం జరుగుతోంది.

జరిమానా వేయలేక గడువు పెంపు

గడువు దాటితే నిబంధనల ప్రకారం రోజుకు రూ.5లక్షలు జరిమానా విధించవచ్చు. జరిమానా జోలికి వెళ్లకుండా గడువు పెంచేందుకు ఇక్కడి అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తున్నారు. ఇటీవల ప్యాకేజీ-1కు సంబంధించి మరోసారి గడువు కావాలని అడిగితే ఆర్వో(రీజినల్ ఆఫీసర్) తిరస్కరించినట్లు సమాచారం. మరోవైపు స్థానిక అధికారులే కాంట్రాక్టర్లకు మేలు చేసేలా ప్రొవిజనల్ కంప్లీట్ సర్టిఫికెట్లు(పీసీసీ) అవసరమైనప్పుడల్లా ఇచ్చేస్తున్నారు. ఇక సీవోఎస్(చేంజ్ ఆఫ్ స్కోప్) రూ.56 కోట్లు అదనంగా ప్రాజెక్టు విలువకు మంజూరయ్యాయి. ఇలా ప్రాజెక్టు విలువ పెంచేస్తూ ప్రజలపై భారం మోపుతున్నారు.

పనులు కాలే.. పైసలు వసూళ్లు

ఓ వైపు పనులు పూర్తి కాకుండానే సేవలు పొందిన మేరకే టోల్ వసూళ్లు చేస్తామంటూ మందమర్రి వద్ద గత 2022 డిసెంబర్, వాంకిడి మండలం సరండిలో గత నవంబర్ నుంచి వసూళ్లు చేపట్టారు. మార్చి తర్వాత మరోసారి టోల్ రుసుం పెరగనుంది. మందమర్రి బ్రిడ్జి పనుల్లో జాప్యంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడంలో వెనుకాడుతున్నారు. రోడ్డు నిర్మాణ పనుల జాప్యంపై ప్రాజెక్టు డైరెక్టర్ అజయ్‌మణికుమార్‌ను 'సాక్షి' సంప్రదించగా, వచ్చే మే నాటికి పూర్తి చేస్తామని తెలిపారు.

ఎన్‌హెచ్–363 ప్రాజెక్టు వివరాలు

నిర్మించాల్సిన రోడ్డు	94 కిలోమీటర్లు
పూర్తయింది	92 కిలోమీటర్లు
ప్యాకేజీ-1 విలువ	రూ.1,356 కోట్లు
పెరిగిన విలువ, ఇతర ఖర్చులతో	రూ.1,948 కోట్లు
ప్యాకేజీ-2 నిర్మాణ విలువ	రూ.1,140 కోట్లు
పెరిగిన విలువ, ఇతర ఖర్చులతో	సుమారు రూ. 1,261 కోట్లు

ఎవరిదీ నిర్లక్ష్యం?

రోడ్డు నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయడంలో కాంట్రాక్టర్లు విఫలమైనప్పటికీ పర్యవేక్షణ చేస్తున్న అధికారుల పాత్ర కూడా ఉంది. ఎప్పటికప్పుడు గడువులు పెంపునకు అనుమతి ఇచ్చేస్తూ.. ప్రాజెక్టు పూర్తి చేయడంలో విఫలం అవుతున్నారు. తాగునీటి పైపులు, అదనపు పనులు, రాష్ట్ర ప్రభుత్వ సహకారం జాప్యం తదితర కారణాలుగా చెబుతున్నారు. అయితే పెరిగిన ట్రాఫిక్‌కు నిత్యం రద్దీతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని సార్లు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

'డయాలసిస్' పాట్లు



"నాపేరు వైరాగరే మనోజ్‌కుమార్. జిల్లా కేంద్రంలోని డయాలసిస్ కేంద్రంలో వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయించుకుంటున్నా. కరెంట్ పోతే జనరేటర్‌లో డీజిల్ పోయడం లేదు. దీంతో డయాలసిస్ ప్రాసెస్ నిలిచిపోయి ఇబ్బంది అవుతోంది. డీజిల్ కోసం పేషెంట్లందరం కలిసి రూ.50 వేల వరకు జమచేశాం. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. కలెక్టర్ స్పందించి సమస్య పరిష్కరించాలి."



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న పేషెంట్లు

- కరెంట్ పోతే పేషెంట్లకు ఇబ్బందే..
- భారంగా మారిన సెంటర్ నిర్వహణ
- పేషెంట్ల డబ్బులతో జనరేటర్ డీజిల్

ఆసిఫాబాద్: జిల్లాలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు రోజురోజుకూ పెరుగుతున్నారు. నాలుగుపదులు దాటిన వారు సైతం ఈ వ్యాధితో సతమతమవుతున్నారు. గతంలో జిల్లాలోని కిడ్నీ వ్యాధిగ్రస్తులు మంచిర్యాల, కరీంనగర్ ప్రాంతాలకు వెళ్లి డయాలసిస్ చేయించుకునే వారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేశారు. కానీ డయాలసిస్ చేసే సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే ప్రాసెసింగ్ నిలిచిపోతుంది. దీంతో పేషెంట్లు కరెంటు వచ్చే వరకు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. జనరేటర్‌లో డీజిల్‌కు నిధులు లేక పోవడంతో పేషెంట్లు వారి ఖర్చులతోనే నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమస్య ను కలెక్టర్ దృష్టికి తెచ్చినప్పటికీ స్పందన లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బతుకుపై ఆశతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆస్తులు అమ్ముకుని చికిత్స చేయించుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

జిల్లాలో 70 మంది పేషెంట్లు

జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్‌లో 70 మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. వారంతా డయాలసిస్ కోసం మంచిర్యాల, కరీంనగర్, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లే వారు. దీంతో వారిపై తీవ్ర ఆర్థిక భారం పడేది. వ్యాధి గ్రస్తుల కోరిక మేరకు గత ప్రభుత్వ హయాంలో అప్పటి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు జిల్లాకు రెండు డయాలసిస్ కేంద్రాలు మంజూరు చేశారు. జిల్లా కేంద్రంతో పాటు కాగజ్‌నగర్‌లో గతేడాది డయాలసిస్ కేంద్రాలు ప్రారంభించారు. ఒక్కో కేంద్రంలో 5 డయాలసిస్ మిషన్లు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణకు ఒక్కో కేంద్రంలో ముగ్గురు టెక్నీషియన్లు, ఒక స్టాఫ్‌నర్స్, ఒక డాటా ఎంట్రీ ఆపరేటర్, ఒక హౌజ్‌కీపర్‌ను నియమించారు. ప్రతీరోజు మూడుషిఫ్టుల వారీగా పేషెంట్లు రక్తశుద్ధి చేయించుకుంటున్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుల పాట్లు

జిల్లాలో రోజురోజుకూ కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. కొంతమంది వారానికి రెండుసార్లు రక్తశుద్ధి చేయించుకుంటుండగా మరి కొంతమంది రోజు విడిచి రోజు చేయించుకుంటున్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు రక్తశుద్ధి ప్రక్రియ నిలిచిపోతుంది. దీంతో తదుపరి డయాలసిస్ చేయించుకోవాల్సిన వారికి ఆలస్యం అవుతుండడంతో ఇబ్బందిగా మారింది. జిల్లా కేంద్రంతో పాటు కాగజ్‌నగర్‌లో సైతం పరిస్థితి ఇలాగే ఉందని పేషెంట్లు వాపోతున్నారు. సమస్యపై ఇటీవల కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

నిధులు కేటాయించాలి



ఏడాది నుంచి కిడ్నీ సమస్యతో ఇబ్బంది పడుతున్నా. వారానికి రెండు సార్లు డయాలసిస్ చేయించుకుంటున్నా. జిల్లా కేంద్రంలోని డయాలసిస్ కేంద్రంలో జనరేటర్ నిర్వహణకు డీజిల్ సమస్య ఉంది. డీజిల్‌కోసం మేమే డబ్బులు పోగు చేసుకుంటున్నాం. ప్రభుత్వం డీజిల్‌కు నిధులు కేటాయించాలి.

– ఇస్లాంబిన్ హసన్, ఆసిఫాబాద్

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: భగత్‌సింగ్ 93వ వర్ధంతిని పురస్కరించుకుని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్‌సింగ్ బ్రిటీష్ వారితో పోరాటం చేస్తూనే మతోన్మాదంపై పోరాటాన్ని కొనసాగించారన్నారు. నేటి యువత భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజన్న, టీకానంద్, శ్రీనివాస్, దుర్గం దినకర్, వినోద, జయ, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇసుక డంపు సీజ్


ఇసుక సీజ్ చేస్తున్న ఆర్ఐ తిరుపతి

జైపూర్: మండలంలోని షెట్‌పల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన 30 ట్రిప్పుల ఇసుకను రెవెన్యూశాఖ అధికారులు శనివారం సీజ్ చేశారు. ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా గుర్తు తెలియని వ్యక్తులు డంపు చేసిన ఇసుకను ఆర్ఐ తిరుపతి సీజ్ చేసి మైనింగ్ అధికారులకు అప్పగించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తప్పిపోయిన యువకుడి మృతదేహం లభ్యం


రాజ్ కుమార్(ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: ఇటీవల తప్పిపోయిన వ్యక్తి మృతదేహం శనివారం మండలంలోని ఆడ ప్రాజెక్టులో లభ్యమైందని సీఐ సతీష్ తెలిపారు. ఎల్లారం కంచరగూడ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బోయిన రాజ్‌కుమార్ (28) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇదే క్రమంలో ఈ నెల 19వ తేదీన ఆటోలో బయటకు వెళ్లాడు. ఆటోను ఆడ ప్రాజెక్టు వద్ద కనిపించగా తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం మృతదేహం ప్రాజెక్ట్‌లో కనిపించింది. మద్యం మత్తులో ప్రాజెక్టుల దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ప్రాథమికంగా నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆటో, కారు ఢీ


క్రేన్ సాయంతో ఆటోను తీస్తున్న దృశ్యం

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని యాపల్ ఏరియాలోని కేకే–2 ఓసీ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం ఆటో, కారు ఢీకొన్న సంఘటనలో తృటిలో ప్రాణనష్టం తప్పింది. మంచిర్యాల వైపు వెళ్తున్న రెండు వాహనాలు అదుపుతప్పి ఢీకొన్నాయి. దీంతో ఆటో రోడ్డు పక్కన బోల్తాపడింది. వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయాలపాలైన వారిని 108 ద్వారా మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వాహనలను క్రేన్ ద్వారా రోడ్డుపైకి ఎక్కించారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరుగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

రైలు కిందపడి రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య


రాజయ్య మృతదేహం

మంచిర్యాలక్రైం: రైలు కిందపడి సింగరేణి రిటైర్డ్ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానిక జీఆర్పీ కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలోని బృందావనం కాలనీకి చెందిన మాటేటి రాజయ్య(65) సింగరేణి ఉద్యోగం చేసి రిటైర్డ్ అయ్యాడు. ఇంట్లో కుటుంబ కలహాలతో మానసిక ఒత్తిడికి గురై తరుచుగా మద్యం తాగేవాడు. మద్యానికి బానిసైన రాజయ్య శనివారం స్థానిక గర్మిళ్ల శివారులో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. భార్య రాజేశ్వరి, ముగ్గురు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న జీఆర్పీ పోలీసులు తెలిపారు.

'గిరి' పల్లెల్లో.. దురాడి సంబురం

అన్ని పండుల్లో ప్రత్యేకమైన పండుగ హోలి, ఈ సంబురాలను ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని గిరిజనులు విభిన్నంగా జరుపుకుంటారు. తమతమ ఆచారాలకు అనుగుణంగా నిర్వహించడం ఆనవాయితీ. ఏళ్ల కాలం నుంచి వస్తున్న ఆచారాన్ని నేటికీ పాటిస్తూ తమకు తామే సాటి అని నిరూపించుకుంటున్నారు. హోలి పండుగ సందర్భంగా ఆదివాసీ గూడెల్లో పండుగ వాతావరణం నెలకొంది.

- నేడు పులారా.. రేపు దురాడి
- సంప్రదాయబద్ధంగా కాముడి దహనం
- ఏళ్లుగా కొనసాగిస్తున్న ఆచారం
- కుడుకలు ఇస్తేనే గ్రామస్తుడిగా గుర్తింపు..
- కాముడి దహనం చేసినే చోటే బస

కుడుకలు ఇచ్చిన వారే గ్రామస్తులు..



ఆదివాసీల సంస్కృతి ప్రకారం హోలి పండుగ రోజు జరుపుకునే ఆచారంలో ఇదో ఆచారం. గ్రామ పటేల్‌కు గ్రామంలోని అందరూ కుడకలు ఇస్తారు. ఇలా కుడకలు ఇచ్చినవారే గ్రామస్తులుగా పరిగణిస్తారు. ఆ గ్రామంలో ఉండి కూడా కుడకులు ఇవ్వకుంటే గ్రామంతో ఆ కుటుంబానికి సంబంధం లేదని గుర్తిస్తారు. ఈ ఆచారం సతియుగం నుంచి వస్తుందని గిరిజనులు చెబుతున్నారు.


నైవేద్యం సమర్పిస్తున్న ఆదివాసీలు (ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకే పెద్దపీట వేస్తున్న గిరిజన ఆదివాసీలు.. తమ సంస్కృతి, సంప్రదాయాలు.. ఆచార వ్యవహారాలను కాపాడడంలో దిట్ట.. తమతమ పండుగలు కూడా అన్ని వర్గాల వారికి భిన్నంగా ఉంటాయి. తమదైన శైలిలో ఈ పండుగ జరుపుకోవడంలో తమకుతామే సాటిగా నిలుస్తున్నారు. ఉగాది... విజయదశమి.. దసరా.. దీపావళి పడుగలు ఒక ఎత్తుగా జరుపుకుంటేంటే.. హోలి పండుగలను మరో రకంగా జరుకుంటారు. ఇందుకు వారి ఆచారాలను తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి అమితానందం పొందుతుంటారు.. ఈ నేపథ్యంలో నేడు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ఆదివాసీల గ్రామాల్లో పులారా, హోలి (దురాడి) పర్వదినం పై 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం...

పులారా అలంకరణ..

వెదరుకర్రలతో రెండు పులారాలను తయారు చేస్తారు. వాటికి ఐదు చోట్ల కుడకలు, గారెలు, గోగు పూలు, చక్కెర పేర్లు, వంకాయ అమర్చుతారు. అనంతరం గ్రామం పొలిమేరలో కాముడి దహనం చేస్తారు. అంతకుముందు రెండు వెదుర్లకు వృద్ధుడు, వృద్ధురాలు అని నామం పెట్టి ఆ పులారాలను కడుతారు. కింది భాగంలో మంట అంటిస్తారు. ఆ మంటపై నుంచి వరుసగా ఆచారం ప్రకారం కొందరు దూకుతారు. అనంతరం గ్రామంలోని ప్రతీ కుటుంబం నుంచి రొట్టెలు, పప్పులు తీసుకొచ్చి కాముడి దహనం వద్ద పూజలు చేస్తారు. తర్వాత వచ్చిన పప్పులు, రొట్టెలను ఒకే చోట చేర్చి సహపంక్తి భోజనం చేస్తారు. రాత్రంతా కాముడి దహనం చేసిన చోటే బస చేస్తారు. అక్కడున్న మట్టిని దొంగలించకుండా కాపాడుతారు.

అన్ని పండుగలకు భిన్నంగా..



ఆదివాసీలు జరిపే పండుగల్లో హోలి, దురాడి పండుగలు భిన్నంగా ఉంటాయి. అంతా ఒక్కటై కాముడి పుణ్యమిని జరుపుకుంటాం. కుడకల ఆచారం చాలా ముఖ్యం. కుడకలు గ్రామపటేల్‌కు అందిస్తేనే వారు ఆ గ్రామంలో ఉన్నట్లు లేకుంటే లేనట్లే.. కాముడి దహనం తర్వాత అందరం రాత్రంతా ఇక్కడే బస చేయడం ఆనవాయితి.

– పెందోర్ దంటీరావు, గ్రామ పటేల్, చిన్న సాకడ(కెరమెరి)

ఎన్నో ఏళ్లగా వస్తుంది.



మా తాత ముత్తాతల నుంచి వస్తున్న ఆచారమిది. అన్ని గ్రామాల్లోని ఆదివాసీలు ఈ పండుగలకు అతీతులే. ప్రతి ఒక్కరూ ఈ ఆచారాన్ని పాటించాల్సిందే. కానీ హోలి, దురాడి కార్యక్రమాల్లో మహిళలు అంతగా పాల్గొనరు. అధికంగా ఈ కార్యక్రమాలను పురుషులు మాత్రమే జరుపుకుంటారు. ఇది అన్ని పండగల్లో భిన్నమైంది.

– పెందోర్ లింగుబాయి, సాకడ(కెరమెరి)

కళావేదిక రాష్ట్ర యువజన అధ్యక్షురాలుగా అక్షిత


మామిడి అక్షిత

చెన్నూర్: చెన్నూర్ పట్టణానికి చెందిన మామిడి అక్షితను శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర యువజన అధ్యక్షురాలుగా నియమించినట్లు కళావేదిక వ్యవస్థాపకులు, చైర్మన్ కత్తిమండ ప్రతాప్ తెలిపారు. ఈ సందర్భంగా అక్షిత మాట్లాడుతూ తాను రాసిన సిరామృతం పుస్తకం ద్వారా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చిందని అన్నారు. శ్రీశ్రీ కళావేదిక సాహితీ రంగంలో తన సేవలను గుర్తించి రాష్ట్ర యువజన అధ్యక్షురాలుగా నియమించారని తెలిపారు. తన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా కళాకారులకు ప్రోత్సహిస్తానని పేర్కొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం ఇస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని వర్క్‌షాప్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా సెక్రెటరీ వెంకటేశ్వర్లు, వర్క్‌షాప్ ఫిట్ సెక్రెటరీ బీ.రమేష్ డిమాండ్ చేశారు. శనివారం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం వర్క్‌షాప్ డీజీఎం రవీందర్‌కు అందజేశారు. ఉపరితలాల్లో కార్మికులకు వేసవిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, చల్లని తాగునీరు, మజ్జిగ, నిమ్మరసం అందజేయాలని పేర్కొన్నారు. అన్ని గదుల్లో కూలర్లు, రోడ్లపై వాటర్ స్ప్రే చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బ్రహ్మచారి, రామస్వామి, మహేశ్‌రాజు, రవి, రాజేశ్వర్‌గౌడ్, సతీష్, సుధాకర్, రాజనారాయణ, రాయలింగు, ఆనందం, శ్రీనివాస్, గోపి పాల్గొన్నారు.

ఏరియా స్టోర్స్‌లో సమస్యలు పరిష్కరించాలి


డీజీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియా స్టోర్స్, టింబర్ యార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ఎస్‌కే.బాజీసైదా డిమాండ్ చేశారు. ఈ మేరకు డీజీఎం యాదయ్యకు శనివారం వినతిపత్రం అందజేశారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి మూడు నెలలు కావస్తున్నా యాజమాన్యం గుర్తింపు పత్రం ఇవ్వడం లేదని, దీంతో సేఫ్టీ కమిటీ, ఏరియా స్ట్రక్చర్ సమావేశాలు జరగడం లేదని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంలో ఆలస్యం జరుగుతోందని తెలిపారు. మహిళా ఉద్యోగులకు పని స్థలాలో సౌకర్యాలతో కూడిన రెస్ట్ హాల్స్ ఏర్పాటు చేయాలని, డ్యూటీ సమయాన్ని ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మార్పు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శి వంగ కుమారస్వామి, నాయకులు ఎడ్ల సమ్మయ్య, అఫ్రోజ్‌ఖాన్, అశోక్, శంకర్, సదయ్య, శివజ్యోతి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో వైద్యుడి మోసం

- ఇద్దరు తోటి వైద్యురాళ్లతో ప్రేమాయణం
- వంచనకు గురికావడంతో ఒకరి ఆత్మహత్యాయత్నం

కాసిపేట: పవిత్రమైన వైద్య వృత్తిలో ఉంటూ ఇద్దరు తోటి వైద్యురాళ్లతో ప్రేమాయణం సాగించాడు. ఇద్దరిలో ఒకరితో పెళ్లికి సిద్ధం కాగా.. వంచనకు గురైన మరో వైద్యురాలు ఆత్మహత్యాయత్నం చేసింది. ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని సోమగూడెంకు చెందిన బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండల వైద్యుడు ఒకరు అదే మండలంలో పని చేసే ఇద్దరు ఎంఎల్‌హెచ్‌పీ(వైద్యులు)లను ఒకరికి తెలియకుండా మరొకరిని ప్రేమించాడు. వెంట తిప్పుకోవడంతోపాటు కుటుంబ సభ్యులకు సైతం పరిచయం చేశాడు. ఇటీవల ఎంఎల్‌హెచ్‌పీలో ఒకరు మంచిర్యాల జిల్లాకు బదిలీ కాగా, మరొకరు జైనూర్‌కు రెగ్యులర్ వైద్యురాలిగా వెళ్లారు. జైనూర్‌కు వెళ్లిన ఆమెను తిరస్కరించి దూరం పెట్టడంతో ఆమె కూడా అతడికి దూరంగా ఉండే ప్రయత్నం చేసింది. మంచిర్యాల జిల్లాకు బదిలీ అయిన ఆమెను పెళ్లి చేసుకోవాలని అనుకున్నాడు. ఈమెతో కలిసి పది రోజుల క్రితం జైనూర్‌లో ఉన్న వైద్యురాలి గదికి వెళ్లి బెదిరించారు. దీంతో మనస్తాపం చెందిన సదరు వైద్యులు తల్లిదండ్రులకు ఫోన్ చేసి పిలిపించుకోగా.. అర్ధరాత్రి వారు అక్కడికి వెళ్లి ఆమెను సోమగూడెంకు తీసుకొచ్చారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు వైద్యుడికి ఫోన్ చేయగా.. అమ్మాయి గురించి చెడుగా మాట్లాడడంతోపాటు తిరస్కరించడంతో మానసిక క్షోభకు గురైన ఆమె యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా పది రోజులుగా చికిత్స పొందుతోంది. అక్కడి న్యాయమూర్తి ఆమె వాంగ్మూలం తీసుకున్నారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు సైతం పంపినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హైదరాబాద్‌లో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలి పరిస్థితి విషమించడంతో శుక్రవారం నిమ్స్‌కు తరలించారు. సదరు వైద్యుడిపై స్థానికంగా సైతం పలు ఆరోపణలు ఉన్నాయి.

'కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరించాలి'


మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్

నెన్నెల: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు, నాయకులు ప్రజలకు వివరించాలని బీజేపీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. శనివారం మండలంలోని నందులపల్లిలో మండల పార్టీ అధ్యక్షుడు శైలేందర్‌సింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల సమావేశంలో వారు మాట్లాడారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో బీజేపీదే విజయమని, కమలం గుర్తుకే ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం పార్టీ మండల ఉపాధ్యక్షులుగా మంగలి శేఖర్, గడ్డం శ్రీనివాస్‌గౌడ్, ఎనగంటి శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా కోట వంశీ, యాదగిరి, కార్యదర్శులుగా కొంగొండ రాజు, రాకేష్, బీజేవైఎం అధ్యక్షుడిగా సాయికిరణ్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా సుకన్యలను నియమించారు. వివిధ పార్టీలకు చెందిన వంద మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు.

క్షయపై అవగాహన


ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు మాట్లాడుతూ యస్ వీ కెన్ ఎండ్ టీబీ అనే నినాదంతో అవగాహన కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి నివారణపై వైద్య సిబ్బందికి వివరించారు. జిల్లాలో 1,445 కేసులు గుర్తించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్షయ వ్యాధి నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి, ఎంసీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ భీష్మ, డాక్టర్ వేదవ్యాస్, డాక్టర్ శ్రీకాంత్, ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయపూర్ణిమ, క్షయ వ్యాధి నివారణ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఫయాజ్‌ఖాన్, డీపీవో ప్రశాంతి, డెమో బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

'ఐకమత్యంతో అభ్యర్థిని గెలిపించుకుందాం'

జన్నారం: ఆదిలాబాద్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించుకోవడానికి ఐకమత్యంతో పని చేయాలని ఆ పార్టీ పార్లమెంట్ విస్తారక్ జీ.సురేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్‌కే ఫంక్షన్‌హాలులో మండల శక్తి కేంద్రం ఇంచార్జీ, బూత్ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నరేంద్రమోదీ పథకాలను ఇంటింటికీ ప్రచారం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, మండల అధ్యక్షుడు గోలి చందు, ప్రధాన కార్యదర్శి దేవేందర్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, మండల అధ్యక్షుడు బోడ తిరుపతి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు గోపాల్, జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య, మధుసూదన్‌రావు, జగన్, ప్రేంసాగర్, మురళి, ప్రవీణ్ పాల్గొన్నారు.

కల్తీ మద్యం స్వాధీనం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని మద్యం దుకాణాలపై శనివారం స్టేట్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) ఎస్పీ అంజిరెడ్డి, సీఐ చంద్రశేఖర్, ఎస్సై భరత్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. పెట్రోల్ పంప్ ఏరియాలోని ఓ మద్యం దుకాణంలో 15 కల్తీ మద్యం బాటిళ్లు (180 ఎంఎల్) లభ్యమయ్యాయి. ఈ మద్యం బాటిళ్లలో నీళ్లు కలిపినట్లు ఎస్‌టీఎఫ్ బృందం తనిఖీల్లో బహిర్గతమైంది. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిపై కేసు నమో దు చేశారు. పూర్తి వివరాలు వెల్లడించేందుకు ఎస్‌టీఎఫ్ బృందం సభ్యులు నిరాకరించారు.

మైనార్టీ గురుకుల ప్రిన్సిపాల్ సరెండర్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని మైనారిటీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్య వైఖరి కారణంగా జిల్లా కలెక్టర్ బదావత్ సంతోశ్ తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీకి సరెండర్ చేసినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో శనివారం పేర్కొన్నారు. మైనారిటీ గురుకులంలో ఇంటర్ ఎంపీసీ రెండో సంవత్సరం చదువుతున్న వహీద అంజుం అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ ఈ నెల 17వ తేదీన హైదరాబాద్‌లోని నిమ్స్‌లో మరణించిందని, ఈ ఘటనకు సంబంధించి పూర్తి విచారణ అనంతరం మైనారిటీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సరెండర్ చేయడం జరిగిందని తెలిపారు.

నూతన నియామకం


దేగ బాపు

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): తెలంగాణ మాజీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దేగ బాపు నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు, వ్యవస్థాపకుడు బొడ్డు దేవయ్య శనివారం నియామక లేఖను అందజేశారు. మాజీ సర్పంచుల సంక్షేమంతో పాటు భవిష్యత్‌లో అండగా నిలిచేలా సంఘం పాటుపడుతోందని తెలిపారు.

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచాలి

పాతమంచిర్యాల: మున్సిపాలిటీలోని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని శనివారం మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ మంచిర్యాల డివిజన్ అధ్యక్షుడు కుంట రాయమల్లు, గౌరవ అధ్యక్షుడు దేవిసత్యం మాట్లాడుతూ మున్సిపాలిటీలో 345 మంది కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు కొన్నేళ్లుగా పని చేస్తున్నారని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.26 వేలు వేతనం ఇవ్వాలని, 11వ పే రివిజన్ స్కేల్ అమలు చేయాలని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ మంచిర్యాల డివిజన్ ప్రధాన కార్యదర్శి గోపాల్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు దుర్గయ్య, సారయ్య, ఓంకార్, రాములు, రాజం, తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ కార్యాలయం ఎదుట ధర్నా

- న్యాయం చేయాలని ఏటిగూడెం గ్రామస్తుల డిమాండ్
- పలువురు నాయకుల మద్దతు


కార్యాలయం ఎదుట బైఠాయించిన గ్రామస్తులు


రేంజర్ కొట్టారని చెబుతున్న చిన్నన్న

బెజ్జూర్: మండల కేంద్రంలోని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం ఎదుట శనివారం ఏటిగూడెం గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. బెజ్జూర్ రేంజ్ పరిధిలోని ఏటిగూడెం గ్రామానికి చెందిన తలండి చిన్నన్న ఏటిగూడెం సమీపంలో గ్రీన్‌మ్యాట్ గుడిసె వేసుకొని కిరాణం నడుపుతున్నాడు. గుడిసెను పెంచేందుకు చిన్నన్న ప్రయత్నిస్తుండడంతో శుక్రవారం సాయంత్రం బెజ్జూర్ రేంజ్ అధికారి దయాకర్, బీట్ అధికారులు సందీప్, అనిత సంఘటనా స్థలానికి వెళ్లారు. గుడిసెను తొలగించాలని ఆదేశించారు. అయినప్పటికీ వినిపించుకోకపోవడంతో అటవీశాఖ అధికారులు గుడిసెను తొలగించారు. తనను రేంజ్ అధికారి కొట్టారని ఏటిగూడెం గ్రామానికి చెందిన తలండి చిన్నన్న ఆరోపించాడు. దీంతో గ్రామస్తులు బెజ్జూర్ రేంజ్ కార్యాలయానికి చేరుకుని ధర్నాకు దిగారు. వీరికి సిర్పూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, జావిద్, శ్రీకాంత్, బీజేపీ నాయకులు జలపతి, శంకర్, రాములు తదితరులు మద్దతు పలికారు. ఈ విషయమై బెజ్జూర్ రేంజ్ అధికారి దయాకర్‌రావును సంప్రదించగా గుడిసెను తొలగించింది వాస్తవమేనని, ఎవరిపై తాను చేతి చేసుకోలేదని వివరించాడు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి


కవాతులో ఏసీపీ, సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ, సీఐలు

బెల్లంపల్లి: పార్లమెంటు ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్ అన్నారు. శనివారం బెల్లంపల్లిలో కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ఫ్లాగ్ మార్చ్ చేశాయి. పాత బస్టాండ్ ఏరియాలోని సింగరేణి తిలక్‌స్టేడియం నుంచి ప్రారంభమై బజారు ఏరియా, కాంటా చౌరస్తా, ఏఎంసీ, కాల్‌టెక్స్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పుర వీధుల మీదుగా రైల్వేస్టేషన్ వరకు పోలీసుల కవాతు సాగింది. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ ఏకే పాండే, బెల్లంపల్లి వన్‌టౌన్, బెల్లంపల్లి రూరల్, తాండూర్ సీఐలు ఎన్.దేవయ్య, అఫ్జలుద్దీన్, కుమారస్వామి, ఎస్సైలు రమేష్, సురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడుదాం


నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పాతమంచిర్యాల: దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో దేశరక్షణకు పోరాటం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో, అంబేద్కర్ చౌరస్తాలోని మంచిర్యాల వ్యూ పాయింట్ వద్ద భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93 వ వర్ధంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడి మనదేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన వీరుల త్యాగం మరువలేనిదన్నారు. దేశంలో మతోన్మాదాన్ని ప్రేరేపిస్తూ మత చిచ్చు రేపుతున్న మతోన్మాదులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, జోగుల మల్లయ్య, ఖలిందర్ అలీఖాన్, మిట్టపల్లి శ్రీనివాస్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయ కార్యదర్శి గుజ్జుల సత్యనారాయణరెడ్డి, నాయకులు గుమ్మడి వెంకన్న, ఆడెపు శంకర్, తిగుట్ల రాములు, సుగుణ పాల్గొన్నారు.